ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 29 అక్టోబరు 2024



గ్రూప్-4 ఫలితాల విడుదల

● 9,491కి పెరిగిన పోస్టులు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒకే సమయంలో 16 లక్షల మంది రాసిన టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన, ఉత్తీర్ణత సాధించిన వారి వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. రాష్ట్రప్రభుత్వ శాఖల్లో 6,244 ఖాళీ పోస్టుల భర్తీకి జూన్ 9వ తేది గ్రూప్-4 పరీక్ష నిర్వహించారు. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) నిర్వహించిన ఈ పరీక్షకు 15.91 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షకు కనీస విద్యార్హత 10వ తరగతి అయినా, యూజీ, పీజీ పట్టభద్రులు సహా ఇంజనీరింగ్ చేసిన వారు పరీక్ష రాశారు. పరీక్షా ఫలితాలు వచ్చే ఏడాది జనవరిలో ప్రకటిస్తామని తొలుత ప్రకటించగా, అనంతరం అక్టోబరులోనే ప్రకటిస్తామన్నారు. ఈ క్రమంలో, ఖాళీ పోస్టుల సంఖ్య 6,244 కాగా, అనంతరం అదనంగా 480, ఆ తర్వాత 2,208 మొత్తం 8,932 పోస్టులు భర్తీ చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. దీంతో, పరీక్ష రాసిన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. పోస్టుల సంఖ్య పెరిగిన కారణంగా కటాఫ్ మార్కులు కూడా తగ్గాయి. గ్రూప్-4 పరీక్షా ఫలితాలు సోమవారం తీతీత్ప్రఇఖ.జౌ.జీ అనే వెబ్‌సైట్‌లో వెలువరించారు. అదే సమయంలో అదనంగా 559 ఖాళీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో, మొత్తం భర్తీచేయనున్న పోస్టుల సంఖ్య 9,491కి పెరిగింది. అందువల్ల కటాఫ్ మార్కులు మరింత తగ్గే అవకాశముంది. పరీక్షల వివరాలను అభ్యర్థులకు ఎస్‌ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా పంపించామని, పోస్ట్ ద్వారా పంపడం లేదు. అందువల్ల అభ్యర్థులు వెబ్‌సైట్‌లోపెరిగిన ఖాళీ పోస్టుల వివరాలు, ఇతరాలు తెలుసుకోవచ్చు. సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ తదితర వివరాలు త్వరలో ప్రకటిస్తామని టీఎన్‌పీఎస్సీ పరీక్ష నియంత్రణ అధికారి ఎ.జాన్‌లూయిస్ ఓ ప్రకటనలో తెలిపారు.

92 రోజుల్లో ఫలితాలు...

గ్రూప్-4 పరీక్ష ముగిసిన 92 రోజుల్లో ఫలితాలు విడుదల చేశారు. పరీక్ష నిర్వహించిన 92 రోజుల్లో ఫలితాలు వెలువరించడం టీఎన్‌పీఎస్సీ చరిత్రలో ఇది తొలిసారి అని అధికారులు తెలిపారు.

టార్గెట్ @200

● అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మనలక్ష్యం ● డీఎంకే పరిశీలకుల సమావేశంలో సీఎం స్టాలిన్





నియోజకవర్గ పరిశీలకుల సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించాలని, అదే తమ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. తేనాంపేట డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం కలైంజర్ అరంగంలో సోమవారం ఉదయం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనే దిశగా డీఎంకే సన్నాహాలను చేపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల పనులను నిర్వర్తించేందుకుగాను 234 నియోజకవర్గాలకు పార్టీ తరఫున పరిశీలకులను ఇటీవలే స్టాలిన్ నియమించారు. వీరంతా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ జిల్లా నేతలను కలుసుకుని, సమావేశాలల్లో పాల్గొని పార్టీ విజయానికి అనువైన వ్యూహరచన చేస్తున్నారు. ఎమ్మెల్యేలు నిర్వహించే సభల్లోనూ ఈ ఇన్‌ఛార్జీలు పాల్గొని ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి ఉన్న పలుకుబడి, ప్రజాదరణ తదితర విషయాలను సేకరించి పార్టీ అధిష్టానానికి నివేదిక సమర్పిస్తున్నారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గం ఇన్‌ఛార్జులు ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర పనులు కూడా చేపడుతున్నారు. అదే సమయంలో ఎన్నికల్లో పోటీకి ఆసక్తి కనబరిచే అభ్యర్థులకు ఉన్న ప్రజాదరణ, అంగ బలం, ఆర్థిక బలం తదితర విషయాలను కూడా సేకరించి అధిష్టానానికి పంపుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇదేవిధంగా నియోజకవర్గాల్లో పార్టీ తరఫున పరిశీలకులను డీఎంకే అధిష్టానం నియమించింది. ప్రస్తుతం ఆ పరిశీలకుల్లో 60 శాతం మందిని తొలగించి పార్టీ యువజన విభాగం, విద్యార్థి విభాగం, మహిళా విభాగం, న్యాయవాదుల విభాగం తదితర పార్టీ విభాగాలకు చెందిన ప్రతినిధులను శాసనసభ నియోజకవర్గాల పరిశీలకులుగా నియమించారు. వీరికి అవసరమైన సలహాలు, సూచనలు తెలియజేసేందుకుగాను సోమవారం ఉదయం అరివాలయంలోని కలైంజర్ అరంగంలో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ ప్రధానకార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్‌బాలు, ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, వ్యవస్థాప కార్యదర్శి ఆర్ఎస్ భారతి, యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి, ఎంపీ కనిమొళి, మంత్రి పొన్ముడి, టీకేఎస్ ఇలంగోవన్, పార్టీ ప్రధాన కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్, నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే కూటమి పటిష్టంగా ఉందని, 200 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమిని గెలిపించేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో ఉన్న కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి ప్రచారం చేయాలన్నారు. ఇప్పటి నుండే నియోజకవర్గమంతటా పరిశీలకులు, ఆయా జిల్లాల కార్యదర్శులను కలుసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు దేని గురించి దిగులు పడకుండా పార్టీ విజయం కోసం పాటుపడాలని, తక్కిన విషయాలన్నింటినీ పార్టీ చూసుకుంటుందని స్టాలిన్ భరోసా ఇచ్చారు. ఇక బూత్ ఏజెంట్లు, బూత్ ఇన్‌ఛార్జీలు కూడా ఇప్పటి నుండే కూటమి గెలుపుపై దృష్టిసారించాలన్నారు.

మాజీ రవాణా ఉద్యోగులకు రూ.370.06 కోట్లు కేటాయింపు

● సీఎం స్టాలిన్ ఆదేశం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖలో పనిచేస్తూ, 2022 డిసెంబరు నుంచి 2023 మార్చి వరకు ఉద్యోగ విరమణ, స్వచ్ఛంద పదవీవిరమణ పొందిన వారు మొత్తం 1279 మందికి గ్రాట్యుడీ, పీఎఫ్, సెలవులు, పింఛన్లు ఇచ్చేంచేందు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.372.06 కోట్లు కేటాయించారు. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖలో 2022 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు ఉద్యోగవిరమణ, స్వచ్ఛంద పదవీ విరమణ, మృతిచెందిన వారు మొత్తం 3414 మందికి గ్రాడ్యుటీ, పీఎఫ్, పింఛన్‌కు నిధులువిడుదల చేశారు. ప్రసుత్తం రవాణా శాఖ ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్నా, కార్మికుల సంక్షేమం కోసం సీఎం స్టాలిన్ రూ.372.06 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని సచివాలయం తెలియజేసింది.

పసుంపొన్‌లో రూ.1.55కోట్లతో దేవర్ అరంగం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



క్యాంపు కార్యాలయం నుంచి దేవర్ అరంగంను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ్ దేవర్ స్మారక స్థలం సమీపంలో రూ.1.55 కోట్లతో నిర్మించిన 'ముత్తురామలింగ దేవర్ అరంగం'ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ప్రతియేటా అక్టోబరు 30న దేవర్ జయంతి వేడుకలకు హాజరయ్యే లక్షలాది మంది ప్రజలు తాత్కాలికంగా బసచేసేందుకు ఓ శాశ్వతమండపాన్ని నిర్మించాలని కొన్నేళ్లుగా దేవర్ సేవాసంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. వారి విజ్ఞప్తులను పరిశీలించిన మీదట దేవర్ స్మారక స్థలం వద్ద కొత్తమండపాన్ని నిర్మించనున్నట్లు గతేడాది అక్టోబరు 28న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. వచ్చే యేడాది దేవర్ జయంతి వేడుకలకు ముందే ఆ మండపాన్ని ప్రారంభిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఆ మేరకు పసుంపొన్ గ్రామంలో దేవర్ స్మారక స్థలం చేరువగా ఉన్న ప్రాంతంలో రూ.1.55 కోట్లతో 'ముత్తురామలింగ దేవర్ అరంగం' (హాలు)ను చెన్నై క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ హాలులో వెయిటింగ్ ప్రాంతం, వీఐపీల కోసం ప్రత్యేకంగా షెడ్‌లున్నాయి. వెయిటింగ్ ప్రాంతంలో 500 మంది మహిళలు, 500 మంది పురుషులు వేర్వేరుగా క్యూలైన్లలో దేవర్ స్మారక స్థలాన్ని చేరుకునే వీలుంది. దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గం, శుభకార్యాలు జరుపుకునేందుకు ప్రత్యేకమైన వేదిక, ఫ్యాన్‌లు కూడా ఉన్నాయి. ఈ అరంగం ప్రారంభోత్సవంలో మంత్రులు సామినాథన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రజాపనుల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మంగత్ రామ్‌శర్మ, తమిళభాషాభివృద్ధి సమాచారశాఖ కార్యదర్శి వి రాజారామన్, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు డా. ఇరా వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు. పసుంపొన్‌లోని అరంగం ప్రారంభోత్సవ వేదిక వద్ద ఎంపీ కె.నవాజ్ కని, శాసనసభ్యులు ఖాదర్‌బాషా ముత్తురామలింగం, ఎస్.మురుగేశన్, రామనాథపురం జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోన్ తదితరులు పాల్గొన్నారు.

శివకాశిలో తగ్గిన బాణసంచా విక్రయాలు



ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టపాసుల తయారీలో అగ్రస్థానంలో ఉన్న విరుదునగర్ జిల్లా శివకాశిలో ఈ ఏడాది దీపావళి టపాసుల విక్రయాలు 20 శాతం మేరకు తగ్గడంపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివకాశిలో ఈ ఏడాది టపాసుల విక్రయాలకు సంబంధించిన టెండర్లు పారదర్శకంగా లేదని ఆరోపించిన చెన్నై టపాసుల విక్రయదారుల సంక్షేమ సంఘం రీ టెండర్‌కు ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ నేపథ్యంలో, విరుదునగర్ జిల్లాలో 3 వేలకు పైగా టపాసుల చిల్లర విక్రయ దుకాణాలుండగా, గత ఏడాది కంటే ఈసారి 20 శాతానికి పైగా టపాసుల అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు.



ప్రత్యేక వార్డును ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో బర్న్ స్పెషల్ వార్డు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టపాసుల ప్రమాదబాధితులకు చికిత్స అందించేలా కీల్పాక్కం, జీహెచ్, స్టాన్లీ ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటయ్యాయి. కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రిలో 1981లో 10 పడకలతో మంటల్లో చిక్కుకొని గాయపడిన వారికి చికిత్స అందించేలా ప్రత్యేక వార్డు ఏర్పాటుచేశారు. కాలిన గాయాల బాధితుల సంఖ్య పెరగడంతో ఈ వార్డులో 75 పడకలకు విస్తరించారు. ఈ నేపథ్యంలో, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం సోమవారం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రిని పరిశీలించి, టపాసుల పేలిన సమయంలో ఏర్పడే గాయాలతో బాధపడే పిల్లల నుంచి పెద్దల వరకు వైద్యం అందించేలా 24 గంటలు పనిచేసే ప్రత్యేక వార్డును పరిశీలించారు. చిన్న, పెద్ద గాయాలు అయిన వారికి మెరుగైన చికిత్సలందించేలా మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.



తేనాంపేట టీయూసీఎస్ కామధేను దుకాణంలో సహకార శాఖ ద్వారా దీపావళి టపాసుల విక్రయాలను ప్రారంభిస్తున్న సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ తదితరులు.


విజయ్‌పై విమర్శల వర్షం

● డీఎంకే, మిత్రపక్షాల దాడి

విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద టీవీకే మహానాడు విజయవంతంగా నిర్వహించిన నటుడు విజయ్‌పై డీఎంకే, దాని మిత్రపక్షాల నేతల సహా బీజేపీ నేతలు కూడా విమర్శల వర్షం కురిపించారు. డీఎంకే మంత్రులు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలు, బీజేపీ నేతలు విజయ్ ప్రసంగంలో చేసిన విమర్శలను తిప్పికొట్టారు. స్పీకర్ అప్పావు టీవీకే బీజేపీకి బీ టీం అని ప్రకటించారు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి టీవీకే బీజేపీకి సీ టీమ్ అని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ నేతలు విజయ్ రాజకీయాల్లో రాణించలేరని, ఆయన పార్టీ సిద్ధాంతాలపై స్పష్టతలేదని ఆరోపించారు. నటుడు విజయ్‌పై వివిధ పార్టీల నేతలు చేసిన విమర్శలు వారి మాటల్లోనే..

(ఆంధ్రజ్యోతి,చెన్నై)

బీజేపీ 'బీ' టీమ్ టీవీకే...!



ఓ నటుడు రాజకీయ ప్రవేశం చేశాడు.. రాష్ట్రంలో ఎంతోమంది నటులు రాజకీయ పార్టీలు ప్రారంభించారు, ఆ వరుసలోనే విజయ్ కూడా వచ్చేశాడు కనుక ఆయనకు శుభాకాంక్షలు చెబుతున్నాను. బుస్సీ ఆనంద్ గురించి చాలా విషయాలు వెల్లడవుతున్నాయి. పుదుచ్చేరిలోని బీజేపీ నేతలతో ఆయన సఖ్యతగా మెలగుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోనూ సంబంధాలున్నాయని చెబుతున్నారు. విజయ్ తాను ఏ పార్టీకీ ఏ టీమ్, బీ టీమ్‌కాదని చెబుతుంటే అనుమానం కలుగుతోంది. డీఎంకే ప్రజాధనం కొల్లగొడుతోందని చెప్పడం గర్హనీయం. బుస్సీ ఆనంద్ ఓ క్రిమినల్ అని విజయ్ తండ్రి ఆరోపించారు. క్రిమినల్ బుస్సీఆనంద్‌ని విజయ్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలా నియమించారో తెలియటం లేదు. గతంలో విజయ్ ఐటీ తనిఖీల సందర్భంగా ఓ నేరస్థుడిలా ఆయనను కార్లలో తిప్పుతూ బాధపెట్టినప్పుడు డీఎంకే ఆయనకు అండగా నిలిచిందన్న విషయాన్ని పూర్తిగా మరచిపోయారు. రాష్ట్రంలో ఇదివరకే రజనికాంత్‌ని రాజకీయాల్లోకి రప్పించాలని బీజేపీ ప్రయత్నించి విఫలమైంది.. ఈ నేపథ్యంలో విజయ్‌ని కూడా బీజేపీయే రాజకీయ ప్రవేశం చేయించిందనే అనుమానం కలుగుతోంది. వీటన్నంటిని బట్టి విజయ్ పార్టీ బీజేపీకి బీ టీమ్ అనే చెప్పవచ్చు.

\- స్పీకర్ అప్పావు

కొత్త ముఖంతో టైమ్‌పాస్..

మళ్ళీ రాజకీయంలో కొత్తముఖం... పాత ముఖాలను చూసి, చూసి బోర్ కొడుతోంది.. ఎన్ని రోజులు పాత ముఖాలనే చూడాలి. మనకూ టైమ్ పాస్ కావాలి కదా..! మనం చూడని ముఖాలా? ఎన్నో ముఖాలను చూశాం.. అన్ని ముఖాలను చూసి, ప్రజల మనస్సును కొల్లగొట్టిన పార్టీ డీఎంకే మాత్రమే.. - డీఎంకే ఎంపీ దయానిధి మారన్

సిద్ధాంతాల్లో స్పష్టత లేదు..



నటుడు విజయ్ మహానాడులో ప్రకటించిన పార్టీ సిద్ధాంతాలలో స్పష్టత లేదు.. సిద్ధాంతపరంగా ఆయన ఇంకా అయోమయంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. విజయ్ జాతీయవాదా? లేక వేర్పాటువాదా? అని తెలియటం లేదు. ఈ విషయంపై ఆయన స్పష్టత కలిగించాల్సి ఉంది.

\- బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త హెచ్ రాజా

డీఎంకే శాఖోపశాఖలుగా విస్తరించిన వటవృక్షం..



పండ్లున్న చెట్టుపైనే రాళ్లపడటం ఆనవాయితీ.. ఎవరు రాళ్ల విసిరినా భరించే శక్తి డీఎంకేకు ఉంది.. డీఎంకేని విమర్శిస్తేనే రాజకీయాల్లో ఎదగవచ్చునని విజయ్ అనుకుంటున్నారు.

\- డీఎంకే నేత ఆర్ఎస్ భారతి.

కామరాజర్ మాకే సొంతం..



రాష్ట్రంలో పెరియార్ తర్వాత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌ను అధికంగా ఆరాధించే పార్టీ కాంగ్రెస్సే.. కామరాజర్ మాకే సొంతం... బీజేపీ కూడా కామరాజర్‌ను ఆరాధిస్తోంది. ఆ వరుసలోనే టీవీకే నేత కామరాజర్ మాకే ఆదర్శం అంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉంది.. ఇండియా కూటమి పటిష్టంగానే ఉంటుంది. కామరాజర్‌ని కీర్తించడాన్ని మా పార్టీ ప్రధాన హక్కుగా భావిస్తాం. - టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

ఏ శక్తులూ డీఎంకేని పడగొట్టలేవు..

డీఎంకే చెల్లాచెదురయ్యే మేఘాల్లాంటిది కాదు.. మంచి సిద్ధాంతాలనే గట్టిపునాదులు కలిగి ఉన్న పార్టీ. ఆ పార్టీనీ ఏ శక్తులూ పడగొట్టలేవు.. స్టాలిన్ ఉన్నంతవరకూ ఏ శక్తీ డీఎంకే కదలించలేదు..

\- మంత్రి పీకే శేఖర్‌బాబు

సూర్యుడు తారలను చూసి భయపడడు...

రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా మాకెలాంటి దిగులు లేదు... ఎందుకంటే ఉదయసూర్యుడు ఎన్నడూ నక్షత్రాలను చూసి భయపడడు.. ఉదయసూర్యుడికి నక్షత్రాలు గురించి ఎలాంటి దిగులూ లేదు.

\- డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్

బీజేపీ 'సీ' టీమ్ విజయ్



డీఎంకే విమర్శిస్తేనే ప్రజల వద్ద పలుకుబడి పెరుగుతుందని నటుడు విజయ్ కలలు కంటున్నాడు... జన ప్రదర్శన కోసం విజయ్ మహానాడు పేరుతో ఓ ఫిలింషో చేశాడు. తొలుత విజయ్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తుందో లేదో తెలియక ముందుగానే అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామంటూ చెప్పడం పెద్ద జోక్. అన్నాడీఎంకే కార్యకర్తలందరినీ తనవైపు తిప్పుకోవడానికే విజయ్ ఆ పార్టీ గురించి అసలు ప్రస్తావనే చేయలేదు. - మంత్రి రఘుపతి


రాహుల్ సిద్ధాంతాల్ని కాపీ కొట్టారు...



టీవీకే మహానాడులో ఆ పార్టీ నేత చేసిన ప్రసంగంలో కొత్త సిద్ధాంతాలేవీ ప్రకటించలేదు. గతంలో తమ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ ప్రకటించిన సిద్ధాంతాలనే కాపీ కొట్టారు.

\- పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి

ఓటమి తప్పదు..



సినీ నటుడు విజయ్ జరిపిన మహానాడు విజయవంతమైంది. అయితే ఆయన రాజకీయాల్లో రాణించలేరు.. తొలిమహానాడులోనే ఆయన చేసిన ప్రసంగం తుస్సుమంది. ఎవరో రచయిత రాసిచ్చిన డైలాగులను ఆయన వల్లెవేశారు.. చాలచక్కగా నటించారు. ఆ మహానాడు సక్సెస్ అయింది. అయితే ఆయన రాజకీయాలు విజయం సాధించవు.

\- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ శ్రీనివాసన్

సమాచార దృష్టి

రాశిపురంలో రూ.35 కోట్లతో మినీ టైడల్ పార్క్

పెరంబూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురంలో రూ.35 కోట్లతో మినీ టైడల్ పార్క్ ఏర్పాటుకానుంది. అందులో భాగంగా ప్రాజెక్ట్ తయారీ, నిర్వహణ పనులకు కన్సల్టెంట్లను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. 500 మంది ఐటీ నిపుణులకు ఉపాధి కల్పించేలా ఈ మినీ టైడర్ పార్క్ ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

నగర జలాశయాల్లో 41 శాతం నీటి నిల్వలు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల దాహార్తి తీర్చే జలాశయాల్లో 41 శాతం నీటి నిల్వలున్నాయి. నగరానికి చెంబరంబాక్కం, పుళల్, పూండి, చోళవరం, కన్నన్‌కోట తదితర ఐదు జలాశయాల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ఐదు జలాశయాల పూర్తి సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.859 టీఎంసీలున్నాయి. ఆ ప్రకారం, చెంబరంబాక్కం జలాశయంలో 40.88 శాతం, పుళల్‌లో 75.3 శాతం, పూండిలో 13.99 శాతం, చోళవరంలో 10.91 శాతం, కన్నన్‌కోట జలాశయంలో 62.3 శాతం నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నేటినుంచి ఎమ్మార్టీఎస్ సేవలు

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-వేళచ్చేరి రైల్వే మార్గంలో మరమ్మతుల కారణంగా ఏడాదిపాటు నిలిపివేసిన ఎమ్మార్టీఎస్ రైలు సేవలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మార్గంలో గత ఏడాది ఆగస్టు 27వ తేది నుంచి మరమ్మతుల కారణంగా వేళచ్చేరి నుంచి చింతాద్రిపేట వరకు మాత్రమే ఎమ్మార్టీఎస్ రైళ్లు నడిపారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో మళ్లీ చెన్నై బీచ్ నుంచి వేళచ్చేరి మధ్య యథావిధిగా మంగళవారం నుంచి ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఈశాన్య రుతుపవనాలతో 39 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సోమవారం వరకు సాధారణం కన్నా 39 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. ఈ నెల 1 నుంచి సోమవారం వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం 151.1 మి.మీ కాగా, ప్రస్తుతం 210.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రాజధాని నగరం చెన్నైలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సోమవారం వరకు సాధారణం కన్నా 47 శాతం అదనంగా వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

చెన్నై - మదురై విమాన చార్జీలు రెట్టింపు

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి సీజన్‌లో చెన్నై - మదురై మార్గంలో విమాన ప్రయాణ చార్జీలకు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఈ నెల 31వ తేదీన దేశ వ్యాప్తంగా దీపావళి పండుగ జరుగనుంది. ఈ పండుగకు మరో రెండు రోజులు మాత్రమే ఉండటంతో ఒక్కసారిగా విమాన చార్జీలు అమాంతం పెరిగిపోయాయి. సాధారణంగా ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ చార్జీ రూ.4500 ఉండగా, ఇపుడు ఇది మూడు రెట్లు పెరిగిపోయాయి. ప్రస్తుతం చెన్నై - మదురై ప్రాంతాల మధ్య ప్రయాణ చార్జీ రూ.12,000 వేల నుంచి రూ.13,000 వరకు పలుకుతుంది. అదేవిధంగా దీపావళి పండుగ ముగిసిన తర్వాత నవంబరు మూడో తేదీన కూడా విమాన చార్జీలు కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

డ్రైవర్లు, కండక్టర్ల సెలవుల కోసం మొబైల్ యాప్

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు సెలవు వివరాలు నమోదుచేసేలా కొత్త మొబైల్ యాప్ పరిచయం చేస్తున్నారు. ఎంటీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టరు సెలవు తీసుకోడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో, 'ఎంటీసీ స్టాఫ్ మొబైల్ యాప్' అనే యాప్‌లో సెలవు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే 24 రోజులు పనిచేసే ఉద్యోగి సెలవు కోసం దరఖాస్తు చేసుకుంటే ఆటోమేటిక్‌గా మంజూరు చేసేలా రూపొందించిన యాప్, నవంబరు నుంచి అమలులోకి రానుందని అధికారులు తెలిపారు.

కుంభకరై జలపాతంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా పెరియకుళం సమీపంలో కుంభకరై జలపాతం వద్ద వరద ఉధృతి తగ్గడంతో పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ అనుమతించింది. పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ జలపాతం వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో, ప్రయాణికుల భద్రత దృష్ట్యా పర్యాటకులను అనుమతించలేదు. ప్రస్తుతం వరద ప్రవాహం తగ్గడంతో 8 రోజులు అనంతరం సోమవారం నుంచి జలపాతం వద్ద స్నానాలను పర్యాటకులను అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చింతాద్రిపేటలో ఆధునిక చేపల మార్కెట్

● నవంబరులో ప్రారంభం



తుది దశ పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో చింతాద్రిపేటలో నిర్మిస్తున్న చేపలమార్కెట్ నవంబరులో ప్రారంభించనున్నారు. రూ.2.19 కోట్లతో 102 దుకాణాలతో ఏర్పాటుకానున్న అధునాతన చేపల మార్కెట్ నవంబరు నుంచి అందుబాటులోకి రానుందని జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ తెలిపారు. చింతాద్రిపేటలో పలు ఏళ్లుగా ప్రైవేటు స్థలంలో చేపల మార్కెట్ నడుస్తోంది. ఈ మార్కెట్ నుంచి దుర్వాసన వస్తోందని, చేపల వ్యర్థాలు సక్రమంగా తొలగించడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ కూడా దాఖలైంది. ఈ కేసు విచారణ సమయంలో, కొత్త చేపల మార్కెట్ ఏర్పాటుచేయనున్నట్లు జీసీసీ గ్రీన్ ట్రిబ్యునల్‌కు తెలియజేసింది. ఆ ప్రకారం, 'చెన్నై 2.0' పథకంలో చింతాద్రిపేటలో చేపల మార్కెట్ ఏర్పాటవుతోంది. తుఫాను వచ్చినా తట్టుకొనేలా పైకప్పు నిర్మించారు. చేపల వ్యర్థాలకోసం ప్రత్యేక డ్రైన్లు, పార్కింగ్ ఏర్పాటుచేశారు. ఈ చేపల మార్కెట్ నవంబరు రెండో వారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని జీసీసీ కమిషనర్ తెలిపారు.

నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముసాయిదా ఓటరు జాబితా మంగళవారం విడుదల కానుంది. మంగళవారం నుంచే సవరణ ప్రారంభం కానుండగా, ఓటరు జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపు, చిరునామా తదితరాలు మార్చేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జనవరి 1వ తేది 18 ఏళ్లు నిండే వారు ఓటరు జాబితాలో పేరు నమోదుకు అర్హులని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ ప్రకారం, ఓటరు జాబితాతో ఆగస్టు 20 నుంచి ఈ నెల 18వ తేది వరకు ఆయా పోలింగ్ బూత్‌ల అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని పేర్లు పరిశీలించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో ముసాయిదా ఓటరు జాబితా మంగళవారం వెలువరించనున్నారు. అనంతరం ఓటరు జాబితా సవరణ ప్రారంభం కానుంది. అలాగే, నవంబరు 9,10,23,24 తేదీల్లో పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా https://voters.eci.gov.in అనే వెబ్‌సైట్, VOTER HELPLINE అనే మొబైల్ యాప్ ద్వారా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకోవచ్చు. సమర్పించిన దరఖాస్తుల పరిశీలన, విచారణను డిసెంబరు 24వ తేదీలోపు పూర్తిచేయనున్నారు. 2025 జనవరి 6వ తేది తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహు తెలిపారు.

కృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

● అన్నాడీఎంకే మాజీ ఎంపీ బాలగంగా



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బాలగంగా, వెట్రిలై మారిముత్తు

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ దివంగత కృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఉత్తర చెన్నై (దక్షిణ) పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి, మాజీ ఎంపీ ఎం.బాలగంగా కొనియాడారు. కృష్ణారెడ్డి 7వ వర్థంతిని పురస్కరించుకొని ఆదివారం జార్జిటౌన్ ఆదియప్ప వీధిలో హార్బర్ దక్షిణ ప్రాంతీయ అన్నాడీఎంకే కార్యదర్శి వెట్రిలై.కె.మారిముత్తు అధ్యక్షతన నివాళి, పేదలకు సహాయాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెయ్యి మందికి చీరలు, ధోవతులు పంపిణీ చేశారు. వర్థంతి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమంలో 1,500 మందికిపైగా పాల్గొన్నారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం బాలగంగాతో పాటు పలువురు పార్టీ ప్రముఖులు ఆయన సేవలు కొనియాడారు.

ఖైదీలు తయారుచేసిన స్వీట్లకు మంచి స్పందన



విక్రయాలు ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ పళని

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మదురై కేంద్ర కారాగారంలోని దుకాణంలో ఖైదీలు తయారుచేసిన ప్రత్యేక స్వీట్లు ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. మదురై జైలులో 1,500 మంది విచారణ, శిక్షపడిన ఖైదీలున్నారు. వారిలో యావజ్జీవశిక్ష పడిన ఖైదీలు శిక్ష ముగించుకొని బయటకు వెళ్లిన సమయంలో నేరాలకు పాల్పడకుండా స్వీయవృత్తులు చేపట్టేలా పలురకాల శిక్షణ అందిస్తున్నారు. జైలు ప్రాంగణంలోని తోటల్లో ఖైదీలు పండించిన కూరగాయలు, పండ్లు రకాలు, మెడికల్ బ్యాండేజ్‌లు, స్వీట్లు రకాలను జైలు దుకాణం ద్వారా ప్రజలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో, దీపావళి పండుగ సందర్భంగా లడ్డూ, హల్వా, పాల్‌కోవా, మైసూర్ పాక్, బాదుషా, జిలేబి తదితరాలను ఖైదీలు తయారుచేశారు. వీటిని 'ఫ్రీడమ్ స్వీట్స్' పేరుతో పావు కిలో, అర కిలో, కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ప్రత్యేక స్వీట్ల విక్రయాలను సోమవారం జైళ్ల శాఖ డీఐజీ పళని ప్రారంభించారు.

మహానాడులో స్పృహ కోల్పోయిన వ్యక్తి మృతి

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే మహానాడుకు వెళ్లి స్పృహ కోల్పోయిన మరో సినీ నటుడు అజిత్ అభిమాని మృతిచెందాడు. కీల్పాక్కంకు చెందిన ఛార్లెస్ (36) ఆదివారం విల్లుపురం జిల్లా విక్రవాండిలో జరిగిన టీవీకే మహానాడుకు వెళ్లారు. మధ్యాహ్నం 3.10 గంటల సమయంలో ఎండ తీవ్రత తట్టుకోలేక అతను స్పృహతప్పారు. అక్కడున్న వారు అంబులెన్స్‌లో ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటుతో మరణించినట్లు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తొక్కిసలాటలో 37 మందికి గాయాలు...

లక్షలాది మంది ప్రజలు హాజరుకావడంతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే పలు జిల్లాలకు చెందిన అభిమానులు రద్దీని నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన బ్యారికేడ్లు తొలగించి లోపలికి వెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో తొక్కిసలాట జరిగింది. అందులో చిక్కుకున్న 37 మందికి గాయాలుకాగా, వారిని కూడా 108 అంబులెన్స్ లో ముండియం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో 8 మంది చికిత్స పొందుతుండగా, మిగితా వారు సోమవారం డిశ్చార్జ్ అయ్యారు.

ఈపీఎస్ మిత్రుడికి ఐటీ షాక్

● ఈపీఎస్ స్నేహితుడు ఇలంగోవన్ వియ్యంకుడి ఇంటిలో రూ.42 కోట్ల నగదు స్వాధీనం

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి స్నేహితుడికి ఐటీ షాక్ ఇచ్చింది. ఈపీఎస్ మిత్రుడు ఇలంగోవన్ వియ్యంకుడు బాలసుబ్రమణ్యం అనే వ్యాపారి నివాసంలో రూ.42 కోట్ల మేర నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈయన తన వ్యాపార కంపెనీలకు సంబంధించి రూ.100 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. ఎన్డీయే కూటమి నుంచి అన్నాడీఎంకే బయటకు వచ్చిన తర్వాత అన్నాడీఎంకే నేతల గృహాల్లో ఈడీ, ఐటీ సోదాలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ ఊహించారు. అందరూ అనుకున్నట్టుగానే గుట్కా కేసులో మాజీ మంత్రి విజయభాస్కర్‌పై చార్జిషీటు దాఖలు చేసేందుకు గవర్నర్ ఆర్ఎన్ రవి అనుమతిచ్చారు. అదేవిధంగా పలువురు మాజీ మంత్రులపై కేసు నమోదుకు కూడా గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎడప్పాడి పళనిస్వామికి సన్నిహితుడైన ఇళంగోవన్ వియ్యంకుడు బాలసుబ్రమణ్యం అనే వ్యాపారవేత్త కోయంబత్తూరులో నివశిస్తున్నారు. ఈయనకు అశ్విని పేపర్ మిల్స్‌తో పాటు పలు వ్యాపారాలున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన 15 మంది ఐటీ అధికారులు బాలసుబ్రమణ్యంకు చెందిన కంపెనీలు, పేపర్ మిల్స్‌లో తనిఖీలు ప్రారంభించి ఆదివారం సాయంత్రంతో పూర్తిచేశారు. అయితే, ఈ తనిఖీల సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఎంతో గోప్యంగా ఉంచారు. సోమవారం ఈ తనిఖీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 22వ తేదీ నుంచి నిర్వహించిన తనిఖీల్లో రూ.100 కోట్ల మేరకు పన్ను ఎగవేతకు పాల్పడినట్లు తేల్చారు. అలాగే, బాలసుబ్రమణ్యంకు నివాసంలో రూ.42 కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ సోదాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే, మున్ముందు కూడా అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రుల నివాసాల్లో ఈడీ, ఐటీ సోదాలు కొనసాగవచ్చని భావిస్తున్నారు.

మెట్రోలో టపాసుల నిషేధం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో రైళ్లలో టపాసులు తీసుకెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ మేరకు సీఎంఆర్ఎల్ విడుదల చేసిన ప్రకటనలో... 2022లో సెక్షన్-61 ప్రకారం మెట్రోరైళ్లలో టపాసులు, మంటలు చెలరేగే వస్తువులు తీసుకెళ్లేందుకు నిషేధం అమలులో ఉందని పేర్కొన్నారు. భద్రతా దృష్ట్యా చేపట్టిన ఈ చర్యలకు ప్రజలు సహకరించాలని సీఎంఆర్ఎల్ విజ్ఞప్తి చేసింది. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఫుట్‌పాత్‌వాసులకు వస్త్రాల పంపిణీ



వేలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లోని అనాథలకు సమాజ సేవకులు అన్బరసన్ దీపావళి పండుగ సందర్భంగా రోడ్డు పక్కన నివసిస్తున్న వంద మందికి నూతన వస్త్రాలు, మిఠాయిలు అందజేశారు.

తల్లిదండ్రులపై హత్యాయత్నం యువకుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని సమీపంలోని నొయ్యికారపట్టిలో తల్లిదండ్రులు, సోదరుడిపై హత్యా చేసేందుకు యత్నించిన యువకుడిని అరెస్ట్ చేశారు. నొయ్యికారపట్టికి చెందిన హనుమంత పెరుమాళ్, మురుగేశ్వరి దంపతులకు ప్రసాద్ (21), శ్రీధర్ (20) అనే కుమారులున్నారు. మద్యానికి బానిసైన శ్రీధర్ ఆదివారం మద్యం సేవించేందుకు తల్లిదండ్రులను డబ్బులు అడుగగా వారు నిరాకరించారు. దీంతో ఆవేశం చెందిన శ్రీధర్, మధ్యాహ్నం ఇంట్లో తయారుచేసిన భోజనంలో క్రిమిసంహారక మందు కలిపాడు. అయితే భోజనానికి సిద్ధమైన తల్లిదండ్రులు, సోదరుడు భోజనంలో ఒక విధమైన వాసన రావడంతో అనుమానంతో శ్రీధర్‌ను చితకబాదగా అతను నేరాన్ని అంగీకరించాడు. దీంతో, శ్రీధర్‌ను పోలీసులకు అప్పగించారు.

మాదకద్రవ్యాల చెలామణిపై పోలీసుల నిఘా



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో నిషేధిత గుట్కా, పాన్ మసాలా, హన్స్ తదితరాలు విక్రయిస్తున్నారని కాట్పాడి డీఎస్పీ పళనికి సమాచారం అందింది. దీంతో, కాట్పాడిలో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీ ఎదురుగా ఉన్న దుకాణాల్లో డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా నిషేధిత మాదకద్రవ్యాలు, నకిలీ బ్రాంది విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామని డీఎస్పీ హెచ్చరించారు.

ఎయిర్‌పోర్ట్‌లో ఎలక్ట్రీషియన్ మృతి

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలంలోని అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో దీపావళి పండుగ సందర్భంగా విద్యుద్దీపాల అలంకరణ చేస్తున్న ఎలక్ట్రీషియన్ 40 అడుగుల ఎత్తు నుంచి జారిపడి మరణించినట్లు పోలీసులు తెలిపారు. విల్లుపురం జిల్లా మరక్కాణంకు చెందిన సెల్వం (26) సహా 20 మదికి పైగా కార్మికులు శనివారం విద్యుద్దీపాల అలంకరణ పనుల్లో పాల్గొన్నారు. సుమారు 40 అడుగుల ఎత్తులో పనిచేస్తూ హఠాత్తుగా కిందకు పడిన సెల్వంకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఆదివారం రాత్రి మరణించినట్లు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర విపత్తుగా వేడిగాలులు

● మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేడిగాలులను రాష్ట్ర విపత్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల కాలంలో, వాతావరణ మార్పుల కారణంగా కొన్ని చోట్ల భారీవర్షాలు, కొన్ని చోట్ల పొడి వాతావరణం, మరికొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోంది. అదే సమయంలో హిమాలయాలు కరిగిపోతుండడంతో సముద్రమట్టం పెరుగుతుందని సమాచారం. అదే సమయంలో ప్రజలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడిగాలుల బారిన పడుతున్నారు. కొన్ని సమయాల్లో ప్రాణాలు కోల్పోయే ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం వేడిగాలులను జాతీయ విపత్తుగా ప్రకటించింది. ఎండవేడికి మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల సాయం అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనేలా వైద్య సౌకర్యాలు, ఓఆర్ఎస్ విపత్తు నిధిని సాయం అందించేందుకు వినియోగించవచ్చు. విపత్తు నిధులను వేడిగాలుల సమయంలో చలివేంద్రాలు ఏర్పాటుచేసి తాగునీరందించేందుకు విపత్తు నిధులు వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

వెయిట్ లిఫ్టింగ్‌లో వేలూరు సత్తా



హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వేలూరు జిల్లా నుంచి పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులు సోమవారం కలెక్టర్ సుబ్బులక్ష్మిని కలుసుకున్నప్పటి చిత్రం

దోమల ఉత్పత్తికి కారణం.. రూ.లక్ష జరిమానా

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ దోమల ఉత్పత్తికి కారణమైన సంస్థకు తాంబరం కార్పొరేషన్ రూ.లక్ష జరిమానా విధించింది. రాష్ట్రంలో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. డెంగ్యూ వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు డెంగ్యూ దోమల ఉత్పత్తికి కారణమైన గృహాలు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలకు జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో, తాంబరం కార్పొరేషన్ 4వ మండలం 53వ వార్డు రెండో వీధిలో అపార్ట్‌మెంట్ నిర్మాణంలో పాల్గొంటున్న 45 మంది కార్మికుల్లో ఇద్దరు, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ముగ్గురు డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నారు. ఈ వ్యవహారంపై కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారులు, నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాలు పరిశీలించగా, 16 ప్రాంతాల్లో డెంగ్యూ దోమల ఉత్పత్తి ఉన్నట్లు గుర్తించి, సదరు సంస్థకు రూ. లక్ష జరిమానా విధించారు.

ప్రమాదరహిత దీపావళిపై అవగాహన ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వేలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి డివిజన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రమాదరహిత దీపావళి-ప్రతి ఇంటా సంతోషం గురించి జిల్లా పాఠశాల విద్యాశాఖ, కాట్పాడి అగ్నిమాపక శాఖ, కాట్పాడి రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు టపాసులు కాల్చడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సతీష్ అధ్యక్షత వహించగా, కాట్పాడి అగ్నిమాపక శాఖ అధికారి తనిగవేల్, ఇండియన్ రెడ్‌క్రాస్ కాట్పాడి శాఖ అధ్యక్షుడు జనార్ధనన్ ప్రసంగించారు. ఉప ప్రధానోపాధ్యాయులు అజిత్‌కుమార్ విద్యార్థినీ, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

నీటమునిగి ఇద్దరు బాలికల మృతి

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో నీటమునిగి ఇద్దరు బాలికలు మృతిచెందారు. కలమావూర్ సమీపం కన్నన్‌కోటన్‌పడికి చెందిన రవిచంద్రన్, తన కుటుంబంతో కలసి మాత్తూర్ సమీపంలోని కాళియమ్మన్ ఆలయానికి సోమవారం ఉదయం వెళ్లారు. ఆలయ సమీపంలోని రాళ్ల క్వారీ ప్రాంతానికి రవిచంద్రన్ కుమార్తెలు గాయత్రి (14), కవిశ్రీ (4) వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా క్వారీలో నీరు చేరింది. దీనిని గమనించని ఆ బాలికలు నీటిలోకి దిగడంతో మునిగారు. గమనించిన చుట్టుపక్కల వారు వారిని రక్షించి కీరనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మాత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రూ.4 కోట్ల స్వాధీనం వ్యవహారం... పుదుచ్చేరి ఎంపీకి నోటీసు

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల సమయంలో తాంబరం రైల్వేస్టేషన్‌లో రూ.4 కోట్లు స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో పుదుచ్చేరి ఎంపీని విచారించాలని నిర్ణయించిన సీబీసీఐడీ ఆయన నోటీసు పంపింది. నగదు స్వాధీనం కేసుపై విచారణ జరుపుతున్న సీబీసీఐడీ పోలీసులు ఆ నగదు హవాలాకు సంబంధించినదని నిర్ధారించారు. నగదుతో పట్టుబడిన వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలంలో, ఆ నగదు బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు చెందిందని స్పష్టమైంది. దీనిపై వివరణ కోరుతూ నయినార్ నాగేంద్రన్‌కు విచారణకు హాజరుకావాలని సమన్లు కూడా పంపించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో హవాలా బ్రోకర్లు, బీజేపీ పుదుచ్చేరి రాజ్యసభ సభ్యుడు ఎంపీ సెల్వగణపతి వద్ద విచారణ జరపాలని నిర్ణయించిన సీబీసీఐడీ, వారికి నోటీసు జారీచేసినట్లు తెలిసింది.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు.... అరెస్టయిన వారికి ఛార్జిషీటు నకళ్లు

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో అరెస్టయిన 30 మందిని సోమవారం ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, వారికి 5 వేల పేజీల ఛార్జిషీటు నకలు అందించారు. వేలూరు జైలులో ఉన్న రౌడీషీటర్ నాగేంద్రన్ అనారోగ్యంతో ఉన్న కారణంగా అతడిని విచారణకు తీసుకురాలేదు. అందువల్ల ఛార్జీషీటు నకలును పోలీసు అధికారులు జైలుకే వెళ్లి అందజేస్తారని సమాచారం.

గంజా, గుట్కా విక్రయం..ఆరుగురి అరెస్టు

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియంతోపు, కన్నికాపురం ఎంఎస్ ముత్తు నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో గంజా, గుట్కా విక్రయించిన కేసులో ఒక మహిళ సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పులియంతోపులో గంజాయి విక్రయించిన కేసులో దేవి (32)అనే మహిళను అరెస్టు చేసి 300 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కేబీ పార్క్ ప్రాంతంలో గంజాయి విక్రయించిన కేసులో దినేష్ (23), సారథి (21), మణిమారన్ (27) అనే వారిని, కొడుంగయూరులో నిషేధిత గుట్కా విక్రయించిన రౌడీ ముత్తు (26), సెల్వి (69) అనే వారిని అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాలు



వృద్ధులకు వస్త్రాలు అందజేస్తున్న కలెక్టర్

వేలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనైకట్టు తాలూకా పొయ్యిగై పంచాయతీలో ఉన్న ఇండియన్ సెంశిలువై వృద్ధుల ఆశ్రమాన్ని సోమవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా దీపావళి పండుగను పురస్కరించుకొని ఆశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలు, స్వీట్లు తదితరాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో వేలూరు కోట తహసీల్దార్ బాలసుబ్రమణి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ వేండా, వృద్ధుల హోం అధికారి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్...

స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమార్, మహిళ పథక డైరెక్టర్ నాగరాజన్, జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, కలెక్టర్ పీఏ అబ్దుల్ మునీర్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ పాల్గొన్నారు.

చెరకు రైతులకు దీపావళి ప్రోత్సాహక నిధి ఇవ్వాలి

● ఈపీఎస్ డిమాండ్

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు దీపావళి ప్రోత్సాహక నిధిని తక్షణం అందజేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... చక్కెర ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేసిన రైతులకు టన్ను చెరకుకు కనిష్ఠ ధరగా రూ.4,000 అందజేయనున్నట్లు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 41 నెలలు గడిచిన నేపథ్యంలో, ఈ ఆర్థిక సంవత్సరంలో చెరకు సరఫరా చేసిన రైతులకు ప్రత్యేక ప్రోత్సాహక నిధిగా టన్నుకు రూ.215 పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటించారని, అయితే ఇప్పటివరకు ప్రభుత్వం చెరకు రైతుల గురించి పట్టించుకోలేదని ఈపీఎస్ ఆరోపించారు.

ఇంటర్వ్యూ

స్వామిని చూడగానే అన్నీ మరచిపోతా..!

'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతి

'స్వామిని ఏవేవో కోరుకోవాలని లిస్ట్ పెట్టుకుని వెళ్తా. తీరా ఆయన్ను చూడగానే అన్నీ మర్చిపోతా. ఏమీ కోరుకోను. నువ్వు ఇచ్చినవాటికి సంతోషంగా ఉన్నాను.. ఇంకా ఇస్తే ఆనందంగా తీసుకుంటా.. స్వామి ఆశీర్వాదముంటే చాలనుకుంటా. స్వామిని దర్శించుకుంటే ఒక పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది' అని సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నారు. పలు తమిళ సినిమాల్లో కథానాయికగా రాణిస్తున్న ఈమె తెలుగులో 'టక్ జగదీష్'లో మరదలుగా, 'కౌసల్య కృష్ణమూర్తి'లో కూతురిగా, 'వరల్డ్ ఫేమస్ లవర్‌లో' భార్యగా, 'రిపబ్లిక్'లో ఎన్ఆర్ఐగా.. ఇలా పలు సినిమాలతో ప్రేక్షకుల్లో ముద్ర వేసుకున్నారు. తిరుమలేశుడిని దర్శించుకున్న ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాలుగేళ్లు తిరుపతిలోనే చదివా

తిరుపతితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నాన్న రాజేష్ హీరో, అమ్మ కొరియోగ్రాఫర్. అమ్మ, మోహన్‌బాబు గారు మంచి స్నేహితులు. దీంతో మా అన్నలతో కలిసి ఇక్కడే శ్రీవిద్యానికేతన్‌లో నాలుగో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు చదువుకున్నా. సెలవుల్నొస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపేది తిరుమలలోనే. ఇప్పుడంటే వీఐపీ బ్రేక్ దర్శనం. చిన్నప్పుడు దర్శనానికి ఎనిమిది గంటల పాటు క్యూలైన్లలో నిలబడేదాన్ని. అన్ని గంటల పాటు వేచి స్వామిని చూడగానే అద్భుతమైన వైబ్రేషన్స్ వస్తాయి. మా అత్త శ్రీలక్ష్మితో (హాస్య నటి) మొదటిసారి వచ్చి స్వామిని దర్శించుకున్నా.

దీపం వెలిగించాకే అడుగు బయటకు

నన్ను వీఐపీ బ్రేక్ దర్శనం స్థితికి తీసుకొచ్చింది స్వామే నని నమ్ముతాను. పెద్ద భక్తురాలిని కానుగానీ షూటింగ్ సమయాల్లోనూ సమీపంలోని ఆలయాలకు వెళ్తుంటాను. దీపం వెలిగించ కుండా బయటకు వెళ్లను. తిరుమల చాలా ఇష్టం. దర్శించుకున్నప్పుడల్లా రెండు మూడు కోరికలు చెప్పు కోవాలనుకుంటాను. స్వామి దగ్గరికి వెళ్లగానే ఒక ట్రాన్స్‌లో ఉండిపోతాను.

స్వామి అనుగ్రహం ఉంటేనే రాగలం

స్వామి అనుగ్రహం ఉంటేనే ఇక్కడికి రాగలమని నమ్ముతాను. చిత్తూరులో కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో స్వామిని దర్శించుకోవాలనుకున్నా. హైదరాబాద్‌లో షూటింగ్ ఉండటంతో దర్శనానికి వెళ్లలేనేమో అనుకున్నా. అనుకోకుండా షూటింగ్ రద్దయింది. చిత్తూరులో కార్యక్రమానికి ముందురోజే వచ్చి స్వామిని దర్శించున్నాను.

పదేళ్లలో చూడని పాత్రలో నటిస్తున్నా

నాది తెలుగులో చివరి సినిమా 'రిపబ్లిక్'. మంచి సినిమా కోసం రెండేళ్ల పాటు వెయిట్ చేశా. తెలుగు సినిమాల కథలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అది చాలా మంచి పాత్ర. గత పదేళ్లలో తెలుగు సినిమాల్లో ఇలాంటి పాత్ర అనేది లేదు. చాలా ఇష్టపడి చేస్తున్నా. గోదావరి అమ్మాయి క్యారెక్టర్. ఎక్కువ భాషలు రావడంలో ఇండస్ట్రీలో కంపర్టబుల్‌గానే ఉంది.

ఈ జనరేషన్ చాలా స్మార్ట్

ఇప్పటి అమ్మాయిలు చాలా స్మార్ట్. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోలతో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. సరిగా వినియోగించుకుంటే మంచి అవకాశాలొస్తాయి. సోషల్ మీడియా పవర్‌ఫుల్ కదా. రీల్స్ బాగా చేస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. ఇటీవల ప్రభాస్ సినిమాలో కూడా ఓ అమ్మాయి హీరోయిన్‌గా ఇలాగే ఎంట్రీ ఇచ్చింది. పదేళ్ల ముందంటే ఓ ఫొటో పట్టుకుని అవకాశాల కోసం తిరిగేవాళ్లం. అందుకే ఈతరం వాళ్లు అదృష్టవంతులంటాను.

పసుంపొన్‌లో దేవర్ జయంతి వేడుకలు ప్రారంభం



దేవర్ స్మారక స్థలంలో పవిత్ర జలాల కలశాలను తీసుకువెళ్తున్న పూజారులు

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అనుచరుడు, దక్షిణాది జిల్లాల ప్రజలంతా దైవంగా ఆరాధించే పసుంపొన్ ముత్తురామలింగ్ దేవర్ జయంతి వేడుకలు సోమవారం ఉదయం యాగశాల పూజలతో ప్రారంభమయ్యాయి. రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలోని దేవర్ స్మారకస్థలం వద్ద ప్రతియేటా దేవర్ జయంతి వేడుకలు మూడు రోజులపాటు నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది దేవర్ జయంతి వేడుకలు సోమవారం ప్రారంభమై బుధవారంతో ముగియనున్నాయి.. తొలి రోజు ఆధ్యాత్మిక వేడుకలు, రెండరోజు రాజకీయ పరమైన వేడుకలు, మూడో రోజు జయంతి జరుపుకుంటారు. ఆధ్యాత్మిక వేడుకల సందర్భంగా సోమవారం దేవర్ స్మారకస్థలం వద్ద ఆయన విగ్రహాన్ని అలంకరించారు. ఉదయం గణపతి యాగం నిర్వహించారు. ఆ తర్వాత అక్కడున్న మురుగన్, దేవర్ తిరుమగనార్ ఆలయంలో పూజలు జరిపారు. సోమవారం సాయంత్రం అష్టోత్తర సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రంతా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు. చివరగా వళ్లి తిరుమణం జరిగాయి. ఈ వేడుకల్లో దక్షిణాది జిల్లాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రేపు స్టాలిన్ సహా నేతల నివాళి...

ఈ నెల 30 జరుగనున్న దేవర్ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్, మాజీ ముఖ్యమంత్రులు ఎడప్పాడి పళనిస్వామి, ఒ. పన్నీర్‌సెల్వం, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నేతలు దేవర్ విగ్రహానికి నివాళుల ర్పించనున్నారు. దేవర్ జయంతి సందర్భం పసుంపొన్ అంతటా సుమారు 5 వేలమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మణిరత్నం మూవీ వదులుకున్నా

● భూమిక



పలువురు నిర్మాతల ఒత్తిడి కారణంగా స్టార్ డైరెక్టర్ మణిరత్నం చిత్రంలో నటించే అవకాశాన్ని వదులుకున్నట్టు సీనియర్ నటి భూమిక వెల్లడించారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. 'నేను తమిళం, తెలుగులో ఎంతో బిజీగా ఉన్న సమయంలో దర్శకుడు మణిరత్నం ఆఫీస్ నుంచి పిలుపు వచ్చింది. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో నటిస్తారా? అని అడగ్గా సరేనని చెప్పాను. అయితే, అది ఓ బిడ్డకు తల్లి పాత్ర. ఆ సమయంలో తెలుగు, తమిళంలో పలు చిత్రాల్లో నటిస్తున్నాను. ఈ విషయాన్ని నిర్మాతలకు చెప్పగా, వారు అంగీకరించలేదు. హీరోయిన్‌గా అయితే, ఫర్లేదుకానీ, తల్లి పాత్రలో చేయడం వల్ల తమ చిత్రాల బిజినెస్‌పై ప్రభావం చూపుతుందని, అందువల్ల ఆ ఆఫర్‌ను తిరస్కరించాలని కోరారు. ఈ కారణంగా మణిరత్నం చిత్రంలో నటించే అవకాశాన్ని కోల్పోయాను. ఆ చిత్రమే 'కన్నత్తిల్ ముత్తమిట్టాల్'. నేను నటించాల్సిన పాత్రలో సిమ్రన్ నటించారు. ఈ మంచి అవకాశం చేజారిపోయిందనే బాధ ఇప్పటికీ నాలో ఉంది' అని పేర్కొన్నారు.

వైభవంగా రంగనాథుడి తీర్థవారి



వివిధ అలంకరణలతో నంబెరుమాళ్

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న శ్రీరంగనాథస్వామి ఆలయంలో తీర్థవారీ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని చంద్ర పుష్కరిణి వద్ద నంబెరుమాళ్‌కు ఆలయ అర్చకులు తీర్థవారి సేవలు నిర్వహించారు. రంగనాథస్వామి ఆలయంలో ప్రతియేటా ఊంజల్ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు కోలాహలంగా నిర్వహిస్తారు. ఈ యేడాది ఈ ఉత్సవాలు ఈ నెల 20 న ప్రారంభమై సోమవారం తీర్థవారీతో ముగిశాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వివిధ రకాల పుష్పాలంతో అలంకరించిన ఊయలలో స్వామివారిని ఆశీనులు కావించి హారతి పూజల అనంతరం భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.



బాణాసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

జోరందుకున్న బాణసంచా విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్ బాణసంచా కొనుగోలు చేసేందుకు వస్తున్న వారితో సందడిగా మారింది. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లే ఈ ఏడాది కూడా ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటుచేసి రిటైల్, హోల్‌సేల్‌గా బాణసంచా విక్రయాలు చేపట్టారు. దీపావళి పండుగకు రెండు రోజులే ఉండడంతో పిల్లలతో సహా పెద్దలు బాణసంచా కొనుగోలుకు వవస్తున్నారు. ఈ ఏడాది పలు కొత్త డిజైన్లతో కూడిన టపాసులు పిల్లలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అలాగే, టపాసుల సంఖ్యను బట్టి గిఫ్ట్ బాక్స్‌లు కూడా విక్రయిస్తున్నారు. 30 రకాల టపాసులుండే గిఫ్ట్ బాక్స్ రూ.850, 40 రకాలుండే బాక్స్ రూ.950, 50 రకాలుంటే బాక్స్ రూ.1,300, 75 రకాల టపాసులుండే గిఫ్ట్ బాక్స్ రూ.3,200లకు విక్రయిస్తున్నారు. పిల్లలు మాత్రమే కాల్చే 55 రకాల టపాసులుంటే గిఫ్ట్ బాక్స్ రూ.1,300లుగా ఉంది.

విజయ్ మహానాడుపై అగ్రహీరోల మౌనం



తమిళ చిత్రపరిశ్రమలోని అగ్రహీరోల్లో ఒకరైన విజయ్ స్థాపించిన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు ఆదివారం జరిగింది. ఈ మహానాడుకు హాజరైన లక్షలాది మంది తమ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి విజయ్ కీలక ప్రసంగం చేశారు. విజయ్ చేసిన తొలి రాజకీయ స్పీచ్ అదుర్స్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే, విజయ్ రాజకీయ భవిష్యత్, టీవీకే తొలి మహానాడు విజయవంతం కావాలంటూ కోలీవుడ్‌కు చెందిన అనేక మంది సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనలు చేశారు. వీరిలో సూర్య, కార్తీ, ప్రకాష్ రాజ్, విజయ్ సేతుపతి, జయం రవి, శివకార్తికేయన్, శశికుమార్, ప్రభు, సిబి సత్యరాజ్, శాంతను భాగ్యరాజ్, అర్జున్ దాస్, వసంత్ రవి, వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్, నెల్సన్ దిలీప్ కుమార్, సూరితో పాటు పలువురు నిర్మాతలు కూడా ఉన్నారు. కానీ, అగ్రహీరోలైన సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్, స్టార్ హీరోలు అజిత్ కుమార్, ధనుష్ మాత్రం మౌనంగా ఉండిపోయారు. అయితే, రాజకీయాల్లో విరోధి అయిన, హీరో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కూడా విజయ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. కానీ, హీరో విజయ్‌కు మంచి స్నేహితుడైన అజిత్ విషెస్ చెప్పకపోవడం ఇపుడు కోలీవుడ్‌లో చర్చసాగుతుంది.

ఆర్‌కే సాలైలో అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ క్లినిక్



'గ్రోహెయిర్ - గ్లోస్కిన్'ను ప్రారంభ దృశ్యం

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరులోని ఆర్‌కే సాలైలో అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ ప్లాస్టిక్ సొసైటీకి చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ కన్నన్ ప్రేమ, నటి ఉమా రియాజ్, నటుడు రియాజ్ ఖాన్, బ్రాండ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వేల్‌తో పాటు ప్రాంచైస్ పార్టనర్లు అశ్విన్, కీర్తన తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ఈ తరహా క్లినిక్ అందుబాటులోకి తీసుకుని రావడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు వెల్లడించారు.



కేథ్‌ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మహమ్మద్ రేలా, మాజీ డీజీపీ శైలేంద్రబాబు

రేలా హాస్పిటల్‌లో కేథ్‌ల్యాబ్ ప్రారంభం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పక్షవాత రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో రోజుకు 24 గంటలపాటు పనిచేసే కొత్త కేథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం ఆ హాస్పిటల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా సమక్షంలో మాజీ డీజీపీ డాక్టర్ శైలేంద్రబాబు ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ ల్యాబ్ రోగనిర్ధారణ, మెదడులో రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి, రక్తంగడ్డ కట్టకుండా నివారించేందుకు, ధమనుల అపసవ్యతను సక్రమపరిచేందుకు దోహదపడుతుందని ప్రొఫెసర్ మహమ్మద్ రేలా చెప్పారు. ప్రపంచ పక్షవాత దినం సందర్భంగా ఈ ల్యాబ్‌ను ప్రారంభించడం సముచితంగా ఉందని శైలేంద్రబాబు చెప్పారు.

దివ్య నేత్రులకు దీపావళి కానుకలు



దీపావళి కానుక అందుకున్న వారితో లయన్స్ క్లబ్ ఆల్ఫా సిటీ సభ్యులు

ప్యారీస్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లయన్స్ క్లబ్ ఆల్ఫా సిటీ సభ్యులు దీపావళి పండుగను పురస్కరించుకొని 23 మంది అంధులకు దీపావళి కానుకగా నూతన వస్త్రాలు, మిఠాయిలు అందజేశారు. అయ్యప్పతాంగల్‌లోని అనాథాశ్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఏటీ రవిచంద్రన్ నేతృత్వంలోని సభ్యులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నపిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి వారితో ఉత్సాహంగా గడిపారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ త్యాగరాజన్ ఈ కార్యక్రమం అనంతరం అంధులందరినీ ఈసీఆర్ రోడ్డులో ఉన్న ఓ రిసార్ట్‌కు తీసుకెళ్లి పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

చిత్రజ్యోతి

'హాయ్' అంటున్న కవిన్ - నయన్



నయనతార

యువ హీరో కవిన్, సీనియర్ నటి నయనతార కలిసి ఓ చిత్రంలో నటిస్తుండగా, దీనికి 'హాయ్' అనే టైటిల్ ఖరారు చేశారు. లలిత్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే 50 శాతం మేరకు పూర్తి చేశారు. త్వరలో తదుపరి షెడ్యూల్ ప్రారంభించనున్నారు. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ వద్ద అసోయేట్ దర్శకుడిగా పనిచేసిన విష్ణు ఎవడన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పూర్తిస్థాయి ప్రేమ కథా చిత్రంగా రూపొందిస్తున్నారు. 2025 వేసవి సెలవుల్లో విడుదల చేసేలా ప్లాన్ చేశారు. ఇదిలావుంటే, కవిన్ హీరోగా శివబాలన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'బ్లడీ బెగ్గర్' చిత్రం దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 31వ తేదీ విడుదలకానుంది. ఆ తర్వాత ఆయన 'కిస్', 'మాస్క్' వంటి చిత్రాల్లో నటించనున్నారు. వీటితోపాటు నయనతారతో కలిసి 'హాయ్' మూవీలో కవిన్ నటిస్తూ కోలీవుడ్‌లో బిజీ హీరో అయిపోతున్నారు.



కవిన్



'శారీ'లో ఆరాధ్య దేవి

విడుదలకు సిద్ధమైన రాంగోపాల్ వర్మ 'శారీ'

ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ డెన్ నుంచి వస్తున్న 'శారీ' చిత్రం డిసెంబరు 20న థియేటర్లలో విడుదలకానుంది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా సోమవారం రిలీజ్ డేట్ వెల్లడించారు. ఇందులో యువనటి ఆరాధ్య దేవి హీరోయిన్‌గా నటించగా, సత్య యాదు హీరో. పలు వాస్తవిక సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. తమిళం, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి గిరి కృష్ణ కమల్ దర్శకుడు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైంది. అతి ప్రేమ భయంకరంగా ఉంటుందనేది ఈ సినిమా మూల కథ. సోషల్ మీడియాలో జరిగే కొన్ని ఊహించని విషయాల వల్ల సమాజంతో పాటు వ్యక్తిగత జీవితంలో జరిగే మార్పులు ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు. ఇందులో భయపెట్టే ప్రేమికుడి పాత్రలో సత్య యాదు నటించారు. కాగా, ఈ చిత్రంలో నటించిన ఆరాధ్య దేవి కేరళకు చెందిన వర్ధమాన నటి. గతంలో శ్రీలక్ష్మి అనే పేరుతో పరిశ్రమకు పరిచయమైంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎవరో తనకు ఫార్వార్డ్ చేసిన ఆరాధ్య రీల్స్ చూసి, 'శారీ' చిత్రంలో హీరోయిన్‌గా రాంగోపాల్ వర్మ ఎంపిక చేయడం గమనార్హం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పోస్టర్లు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించిన విషయం తెలిసిందే.



పచ్చని పొలంలో తెల్ల కొంగలు

వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ పొలాల్లో కొంగల సందడి ఎక్కువైంది. దమ్ము చేసిన పొలాల్లో, ఏపుగా పెరిగిన పచ్చని పైరుల మధ్య, పిల్ల గాలులకు కొంగలు అటు ఇటు ఎగురుతూ కనువిందు చేస్తున్నాయి. పంటలకు కీడు తలపెట్టే పురుగులను ఏరి తింటూ రైతులకు మిత్రుల్లా సాయం చేస్తున్నాయి. నాగలాపురం మండలం గోపాలపురం వద్ద పొలాల్లో గుంపులుగా వాలిన కొంగలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఏంటి సిస్టర్ ఇది?

స్విమ్స్‌లోని ఓపీ విభాగం సోమవారం రోగులతో కిక్కిరిసిపోయివుంది. న్యూరాలజీ ఓపీ విభాగంలో వందమందికి పైగా రోగులు వైద్యుల అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడ బీపీ, పల్స్ చూడాల్సిన స్టాఫ్‌నర్సు ఇలా ఫోను చూస్తూ ఉన్నారు. మధ్యమధ్యలో కాసేపు బీపీ చెక్ చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రగిరి, అక్టోబరు 28: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. పవిత్రోత్సవాల కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు కల్యాణోత్సవం, మంగళవారం స్వర్ణపుష్పార్చన, బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, ఆర్జితం సేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్థులు(ఇద్దరు) రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. పవిత్రం, ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, అనంబట్టు ధనశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

వడమాలపేట, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బంగారెడ్డి ఎస్టీ కాలనీకు సమీపంలో ప్రభుత్వ గుట్ట పొరంబోకు ఆక్రమణను తొలగించారు. 'ప్రభుత్వ భూమికి కంచె' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరు చొరబడినా శిక్షార్హులేనని, క్షమించేది లేదని తహసీల్దారు జరీనా హెచ్చరించారు.



పద్మనాభం కుటుంబం

శ్రమజీవన సౌందర్యం

పుత్తూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెల్లవారకముందే ఆ అమ్మాయి పశువుల కొట్టంలోకి వెళ్తుంది. పేడ జవిరి కుప్ప పోస్తుంది. చీపురు అందుకుని ఊడవడం మొదలుపెడుతుంది. ఆ వెంటనే తమ్ముడు రంగంలోకి దిగుతాడు. పశువులన్నింటినీ కడిగి శుభ్రం చేస్తాడు. చిన్నతమ్ముడు పాల క్యాన్‌లతో అక్కా అన్నలకి సాయంగా వస్తాడు. దానా వేసి, కగుడు నీళ్ల తాగించి, పాలు పితికి క్యాన్‌లు నింపుతారు. అక్క ప్రియదర్శిని ఇంజీనింగ్ గ్రాడ్యుయేట్. సివిల్స్‌కి కోచింగ్ తీసుకుంటోంది. పెద్ద తమ్ముడు ఉమేష్ ఇంజనీరింగ్ ఫైనలియర్. చిన్నవాడు శశికిరణ్ నీట్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఇన్‌స్టాలో రీల్స్ కోసం చేసిన ఫోటో షూట్ కాదు ఇది.. వారి దినచర్య. వ్యవసాయ కుటుంబాల్లో శ్రమకు ఉండే గౌరవానికి ప్రతీకగా కనిపిస్తుంది ఆ కుటుంబం. పుత్తూరులో నారాయణవనం రోడ్డులో వీరి నివాసం. నాన్న పద్మనాభానిది నారాయణవనం మండలం ఎరికంబట్టు. 60 సెంట్ల భూమి.. గంపెడు కుటుంబం.. రెక్కలు ముక్కలు చేసుకునేవారు. రెండు బర్రెలు పట్టుకుని భార్య ఆసరాగా నిలచింది. ఇంతలో అతనికి పోలీసు ఉద్యోగం వచ్చింది. పిల్లలు బాగా చవుకుని వృద్ధిలోకి రావాలనే కల నెరవేర్చుకోవడానికి పోలీసు జీతం ఎంత? రెక్కల కష్టాన్ని తమ పిల్లలకు కూడా వారసత్వంగా ఆ తండ్రీ, తల్లీ అందించారు. వారి మనసెరిగిన ఆ బిడ్డలూ తమ గుడ్డలు నలుగుతాయని వెరవలేదు. ఇంజనీరింగ్ చదువుతూ పేడ పనేమిటని సిగ్గు పడలేదు. స్నేహితుల ముందు అవమానం అని ఎన్నడూ అనుకోలేదు. చదువుకుంటూనే అన్ని పనులూ చేస్తున్నారు. ఇప్పుడు వారి దగ్గర 14 ఆవులు, నాలుగు బర్రెలు ఉన్నాయి. కాలేజీకి వెళ్లే ముందూ, వచ్చిన తర్వాత కూడా ఆ ముగ్గురు పిల్లలూ ఒళ్లు అలిసేలా శ్రమిస్తారు. కష్టం చేస్తూ కళకళలాడుతూ తిరిగే వీరిని చూసి 'దేవుడు దీవించి మావాడికి మంచి బిడ్డల్ని ఇచ్చాడు' అని పద్మనాభం తల్లిదండ్రులు ఆనందంగా చెప్పుకుంటారు.

4న 'కో-వర్కింగ్ స్పేస్' భవనం ప్రారంభం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువిక నగర్ సమీపంలోని అగరం వద్ద నగరంలోనే తొలిసారిగా 'ముదల్వర్ పడైప్పగం' పేరుతో నిర్మించిన కో-వర్కింగ్ స్పేస్ భవనాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 4న ప్రారంభించనున్నారు. సోమవారం ఉదయం దేవాదాయ శాఖ మంత్రి, సీఎండీఏ చైర్మన్ పీకే శేఖర్‌బాబు అధికారులతో కలిసి ఆ భవనం తుదిదశ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ భవనం ఉద్యోగాలు చేస్తూ చదివే విద్యార్థులకు అనువైన ప్రాంతమని, ఒకే చోట 51 మంది చదివేందుకు వసతులున్నాయని తెలిపారు. అంతే కాక విద్యార్థులు చదివేందుకు గ్రంథాలయం కూడా ఉంటుందన్నారు. అదే విధంగా భవనంలో మూడు కాన్ఫరెన్స్ హాళ్లుంటాయన్నారు. ఈ భవనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో నిర్మించారని చెప్పారు. మంత్రితో పాటు మేయర్ ఆర్.ప్రియారాజన్, నగరాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పర్యటించారు.

కో-వర్కింగ్ స్పేస్ భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు



సిరుచ్చేరిలో రూ.5 కోట్లతో 'అర్బన్ ఫారెస్ట్'

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిరుచ్చేరి సమీపంలో రూ.5 కోట్లతో 50 ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ ఏర్పాటు కానుంది. 2021 భారత అటవీ శాఖ వెలువరించిన నివేదికలో రాజధాని నగరం చెన్నైలో 5.3 శాతం మాత్రమే అడవులున్నాయని తెలిసింది. అందుకు తగ్గట్టుగానే నగర వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ చిన్న అడవి సృష్టించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడకు వచ్చే ప్రజలకు సీట్లు, ఫుట్ పాత్ సహా పలు సదుపాయాలు కల్పించనున్నారు. ఈ అటవీ ప్రాంతం ఏర్పాటుకు టెండర్లు విడుదల చేసినట్లు, ఒప్పంద సంస్థను ఎంపిక చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం తెలియజేసింది.

చెన్నై పోర్ట్ ట్రస్టులో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చెన్నై పోర్టు చైర్మన్ సునీల్ పాలీవాల్

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై పోర్టు సంస్థలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవం సోమవారం ప్రారంభమైంది. 'సాంస్కృతిక సమైక్యతతో జాతీయ సుసంపన్నత' అనే నినాదాన్నే ప్రాధాన్యంగా చేసుకుని ఈ వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెన్నై పోర్టు చైర్‌పర్సన్ సునీల్ పాలీవాల్ తెలిపారు. ఈ సందర్భంగా పోర్ట్ ఉద్యోగులతో అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్. విశ్వనాథన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.మురళీకృష్ణన్, ఆ సంస్థలోని వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





సైదాపేట బజారు వీధిలో రూ.79 లక్షలతో నిర్మించనున్న స్కూలు భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం



చెన్నై రిప్పన్ భవనంలో కార్పొరేషన్ ఉద్యోగులు, సిబ్బంది చేత అవినీతి నిరోధక అవగాహన ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ ఆర్ ప్రియారాజన్

కలిగిరి కొండ మహావిష్ణు ఆలయంలో మహా కుంభాభిషేకం

- కంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో పూజలు

పెనుమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని కలిగిరి కొండ కింద వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణు ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదంతో మాస సంప్రోక్షణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఆలయ నిర్మాణం 2002లో మాజీ ఎంపీ చెంగల్రాయ నాయుడు చేపట్టారు ఈ ఆలయాన్ని విజయేంద్ర సరస్వతే ప్రాణప్రతిష్ఠ చేశారు. 2014లో చెంగల్రాయనాయుడు కుటుంబీకులు ఈ ఆలయాన్ని కంచి కామకోటి పీఠానికి అప్పగించారు. అప్పటినుంచి వారి ఆధ్వర్యంలోనే పూజలు జరుగుతున్నాయి. సోమవారం చెంగల్రాయ నాయుడు కుమారుడు ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 50మంది వేదపండితులు మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పీఠాధిపతికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్వాగతం పలికారు



విజయేంద్ర సరస్వతితో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు